## 12

# కృప చేత రక్షించబడడం

## (ఎఫెసీయులకు 2:1-10)

దేవుని గుణములలో ఆయన అద్భుత శక్తి కూడా ఉందని ఆదికాండము 1 మరియు 2 అధ్యాయములలో మనం నేర్చుకున్నాము. ఇదే విషయాన్ని పౌలు ఎఫెసీయులకు 3:20, 21లో స్పష్టం చేస్తున్నాడు:

> మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగువాటన్నిటికంటెను, ఊహించువాటన్నిటికంటెను అత్యధికముగా చేయ శక్తిగల దేవునికి, క్రీస్తుయేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగునుగాక. ఆమేన్.

పౌలు ప్రకారం, మనం అడుగువాటికంటె, ఆఖరికి ఊహించువాటికంటే ఎంతో ఉన్నత కార్యములను దేవుడు చేయ సమర్థుడు. దేవుని శక్తి గురించి 1:19–23లో పౌలు ముందే చెప్తున్నాడు. అతడి ప్రకారం, "దేవుని శక్తి యొక్క అపరిమితమైన మహాత్మ్యము," "విశ్వసించు మనకు" ఇయ్యబడింది. మనం బలహీనులమైయున్నను, మనమాయన చిత్తమునకు లోబడియున్నట్లయితే, దేవుడు మన ద్వారా కార్యం జరిగించుతాడు. ఏ నిరీక్షణ లేకుండా నశించిపోయిన పాపులను రక్షించుటకు దేవుడు సమర్థుడు అని చెబుతూ దేవుని శక్తి గురించి ఎఫెసీయులకు 2:1–10లో పౌలు చెప్తున్నాడు. (2:1 ప్రారంభంలో "మరియు" అన్న ఇంగ్లీషు పదం ఇయ్యబడింది. కాబట్టి "శక్తిని" గురించిన చర్చ కొనసాగించబడిందని చెప్పవచ్చు.)

యేసు పాపులను రక్షించుటకు ఉన్న ఏకైక ఆధారము అని క్రొత్త నిబంధన స్పష్టం చేస్తుంది. దీనిని యేసే స్వయంగా యోహాను 14:6లో చెప్తున్నాడు, "నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు." ఇదే సత్యాన్ని అపొస్తలులు ప్రకటించారు: "మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" (అపొస్తలుల కార్యములు 4:12). "దేవుని కుమారుని అంగీకరించువాడు జీవముగలవాడు; దేవుని కమారుని అంగీకరింపనివాడు జీవములేనివాడే" (1 యోహాను 5:12) అని యోహాను వ్రాస్తున్నాడు.

కాబట్టి సర్వమానవాళిని, రెండు రకాలుగా విభాగింపవచ్చు. మన పాపములకు పరిపూర్ణ బలి అయిన క్రీస్తు రక్తము చేత రక్షింపబడినవారు మరియు నశించిపోయి, క్షమాపణ లేకుండా రక్షింపబడనివారు.

### "మీరు చచ్చినవారైయుండగా ..."

క్రీస్తునకు వేరై దూరంగా ఉన్నప్పుడు మన యొక్క స్థితిని గురించి వివరిస్తూ పౌలు మనం నశించిపోయిన వారమని మాత్రమే చెప్పడం లేదు గాని, మనం "చచ్చినవారము" అని సంబోధిస్తున్నాడు: "మీ అపరాధములచేతను, పాపములచేతను మీరు చచ్చినవారై

యుండగా ..." (2:1, 2ఎ). క్రీస్తు లేనివారి గురించి వివరిస్తూ చనిపోవడము అనే వర్ణను ఎందుకు పౌలు ఉపయోగించాడు? మొదటిగా, దేవునికి ప్రతిస్పందించలేని స్థితి గురించి ఇది తెలియజేస్తుంది. మన ప్రియమైన వారు చనిపోయినప్పుడు కలిగే భయానక ప్రతిఫలం ఏమిటంటే, ఇదివరకు వారు సజీవంగా ఉన్నప్పటివలె గాక వారు మన మాటలకు, స్పర్శకు ప్రతిస్పందించరు. క్రీస్తునకు దూరంగా ఉన్నవారు కూడ దేవునికి, ఆయన చిత్తమునకు ప్రతిస్పందించరు కాబట్టి వారు చచ్చినవారే. రెండవదిగా, చనిపోయినవారు ఖచ్చితంగా నిస్సహాయులు. చనిపోయినవారు నిర్జీవులు కాబట్టి తమ ఉనికిని నిలువబెట్టుకోవడానికి లేదా తమ స్థితిని మార్చుకోలేని నిస్సహాయులు. క్రీస్తునకు వేరైనప్పుడు మనం కూడా మన స్థితిని మార్చుకోలేని నిస్సహాయులమే. కాబట్టి క్రీస్తునకు దూరమయిన మనము "చచ్చినవారమే" అన్న నుడి సరైనదే.

ఆత్మీయ మరణమును గురించిన తన చర్చను పౌలు కొనసాగించాడు: ఆత్మీయంగా చనిపోయినవారు మృతులు. ఎందుకంటే, వారు "అపరాధులు, పాపులు." అందుకు కారణం ఈ పాపములలో ఒకప్పుడు మనం "నడుచుకున్నాము" (జీవించాము) అని పౌలు చెప్తున్నాడు. యిలా చేయడం ద్వారా మనం "ప్రపంచ ధర్మము" ("ఈ లోకరీతిగా"; NIV)చొప్పున జీవించాము. అలా చేయడం ద్వారా "వాయుమండల సంబంధమైన అధిపతిని, అనగా అవిధేయులైన వారిని ఇప్పుడు ప్రేరేపించు శక్తికి అధిపతిని అనుసరించి యీ ప్రపంచ ధర్మము చొప్పున నడుచుకొంటిరి" (2:2). ఇది సాతానును సూచిస్తుంది. ఈ లోక వాతావరణంలో పైనున్న దుర్గతుల సమూహమును పాలించువాడు ఇతడు. "మీరు అపవాది తంత్రములను ఎదిరించుటకు శక్తిమంతులగునట్లు దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి" (6:11) అని పౌలు తరువాత వ్రాస్తున్నాడు. "ఇవన్నియుగాక విశ్వాసమను డాలు పట్టుకొనుడి; దానితో మీరు దుష్టుని అగ్ని బాణములన్నిటిని ఆర్పుటకు శక్తిమంతులవుదురు" (6:16). కొరింథీ సంఘానికి వ్రాస్తూ సాతానును "ఈ యుగ సంబంధమైన దేవత" అని పౌలు వ్రాస్తున్నాడు (2 కొరింథీయులకు 4:4). మనలను సృష్టించిన దేవుని పరిపాలనను మనం త్రోసిపుచ్చితే, మనం మనకు తెలియజేయకుండానే "ఈ యుగ సంబంధమైన దేవత" పరిపాలనను అనుసరిస్తున్నవారమవుతాము.

దేవునికి వ్యతిరేకమైన జీవన విధానం గురించి పౌలు ఇంకనూ యిలా వ్రాస్తున్నాడు: "వారితో కలిసి మనమందరమును శరీరముయొక్కయు మనస్సుయొక్కయు కోరికలను నెరవేర్చుకొనుచు, మన శరీరాశలను అనుసరించి మునుపు ప్రవర్తించుచు, కడమవారివలెనే స్వభావసిద్ధముగా దైవోగ్రతకు పాత్రులమైయుంటిమి" (2:3). మన శరీర ఆశలను అనుసరించడం అంటే, స్వార్థముగా ప్రవర్తించడం మరియు దేవుని మార్గములో గాకుండా మన సొంత మార్గములో నడుచుకోవడం. శరీరము మరియు మనస్సు యొక్క కోరికలను నెరవేర్చడం అంటే, మనం దేవుని చిత్తమును విసర్జించి మన పతనమును బట్టి మనకు మనమే స్వనాశనం తెచ్చుకోవడం. క్రీస్తును కలిగిఉండని మనలోని "కొందరి" జీవన విధానం ఇది అని పౌలు చెప్పడం లేదు గాని, ఇది "అందరి" స్వభావం అని చెప్తున్నాడు. క్రీస్తు లేకపోయినట్లయితే, మనమందరం దేవుని ఉగ్రతకు పాత్రులమయ్యేవారము.

ఆత్మీయ మరణమునకు మూడు ప్రాథమిక లక్షణాలున్నాయి: మోసం (మనం అపాయకర స్థితిలోనుండగా, మనం క్షేమంగా ఉన్నామని భావిస్తాము). అవిధేయత (మన

ఆశలననుసరించడం వలన మనం దేవుని చిత్తమునకు దూరంగా ఉంటున్నాము). ఉగ్రత (దీనివలన ఆఖరకు కలిగే ఫలితం, దేవుని ఉగ్రతను ఎదుర్కొనడం). యేసు రాక ముందు వరకు ఒక్కొక్కరూ ఎదుర్కొన తగిన పరిస్థితి ఇది. ఇదంతా ఏ నిరీక్షలేనిదిగా ఉంది. కానీ ఇంకా ముందుకు చదివేవరకు ...

## "అయినను దేవుడు ..."

బహుశ బైబిల్లో ప్రాముఖ్యమైన పదాలైన "అయినను దేవుడు" అన్న పదాలతో 4వ వచనం ప్రారంభమవుతుంది. బైబిలు యొక్క ముఖ్య పదం దేవుడు, "దేవునికి సమస్తమును సాధ్యమే" (మార్కు 10:27) అని యేసు చెప్తున్నారు. ఒకవేళ దేవునికి యిలా కాకపోయినట్లయితే మనమందరం ఖచ్చితంగా శిక్షించబడి యుండేవారము. రక్షణ అనేది మనకు మనముగా ప్రయత్నించి సాధించేది కాదని పౌలు ఇక్కడ స్పష్టం చేస్తున్నాడు. ఇదంతా కేవలం దేవుని ప్రయత్నమే.

మనయెడల తన మహాప్రేమను చూపిన దేవుడు "కరుణా సంపన్నుడు" అని పౌలు వివరిస్తున్నాడు. తన మహాప్రేమ మరియు కృపచేత ఆయన మనలను క్రీస్తుతో కూడ బ్రదికించాడు, క్రీస్తుతో కూడ లేవనెత్తాడు, ఆయనతో పాటు పరలోకంలో కూర్చుండబెడుతున్నాడు. ఇదంతయు చేయుటకే కారణము, క్రీస్తు యేసునందు తన కృపా మహదైశ్వర్యమును కనుపరచుటయే (7 వచనం). మరో మాటలో చెప్పాలంటే, మనము కూడా దేవుని కుమారుడైన క్రీస్తుతో కూడ నిత్యజీవములో పాలివారమైయుండుటకు, చనిపోయి తిరిగి లేచిన (చూడు రోమీయులకు 6:1-5) క్రీస్తుతో మనలను కలుపుతున్నాడు. మనకున్న ఏకైక నిరీక్షణ ఏమిటంటే, మనము క్రీస్తు ద్వారా, సువార్తవలన ఆయనతో ఏకమైయున్నాము.

## "విశ్వాసము ద్వారా కృపచేతనే ..."

మనం క్షమించరాని పాపులమైయుండగా, దేవుడు మన యెడల తన ప్రేమను ఏ విధంగా చూపగలిగాడు. మన పాపములను, వాటి ప్రభావాన్ని మన మీదనుండి ఎందుకు తప్పించగలిగాడు అన్నది మనకిప్పటికీ ఆశ్చర్యకరంగానే ఉంటుంది. ఈ ప్రశ్నకు పౌలు స్పష్టమైన సమాధానాన్ని ఇస్తున్నాడు.

"కృపచేతనే" దేవుడు దీనిని చేయగలిగాడు అని పౌలు వ్రాస్తున్నాడు (2:5, 8). "కృపను" ఒక రచయిత యిలా నిర్వహిస్తున్నాడు:

> సహాయం పొందుటకు, ప్రేమను పొందుటకు ఒక వ్యక్తి పూర్తిగా అయోగ్యుడయినను, వారికి సహాయం చేయుటకు హృదయ పూర్వక ప్రేమతో విశాల దాతృత్వముతో, నిస్వార్థ, స్వేచ్ఛాయుత సహాయాన్ని అందించడమే కృప.[2]

ఒక చిన్న పిల్లవాడు కృపను యిలా సులభంగా నిర్వచించాడు – "మనం పొందడానికి సాధ్యం కాకున్నా, దాన్ని పొందుకోవడమే కృప."

యేసు క్రీస్తు మనయెడల తన అధికమైన కృపను కుమ్మరింప చేయుటకు చెప్పుకోదగ్గ మంచి ఉదాహరణ లూకా 15లోని "తప్పిపోయిన కుమారుడు." హృదయాలను కదిలించే ఈ కథలో ప్రభువు ఒక యువకుని గురించి చెప్తున్నారు, తన తండ్రి చనిపోయేంత వరకు

ఉండలేక, తన ఆస్తి వాటాను తనకు పంచి ఇవ్వమని ఆ యువకుని తండ్రిని తొందరపెడతాడు. తరువాత అతడు దానితో “దూర దేశమునకు” వెళ్ళి తనకు నచ్చిన విధంగా, ఇష్టానుసారంగా, విచ్చలవిడిగా జీవిస్తూ తన డబ్బును ఖర్చుపెడతాడు. అంతా ఖర్చయ్యాక, ఆకలికి తట్టుకోలేక పందులను మేపే పనిలో చేరతాడు. అక్కడ తన తండ్రి ఇంటికి తిరిగి చేరుకోవాలని ఆశపడతాడు. తండ్రి దగ్గరకు వెళ్ళి, కుమారుడుగా తాను యోగ్యుడను కానని ఒప్పుకొని, తనను ఒక సేవకునిగా చేర్చుకొనుమని తండ్రిని అడుగుటకు సిద్ధమవుతాడు. కనీసం ఇలానైనా తన ఆకలి బాధ తీరుతుందని అతడు భావిస్తాడు. తన తండ్రినుండి కఠినత్వమును తప్ప మరింక ఏమీ ఆశించలేని పరిస్థితుల్లో ఇంటి ముఖం పడతాడు. అయితే దానికి బదులు, “అతని తండ్రి అతనిని దూరముగా ఉన్నప్పుడే” చూచాడని (20 వచనం) యేసు చెప్తున్నారు. బహుశా యువకుడు ఇల్లు వదిలినప్పటినుండి ఆ తండ్రి అతని కోసం చూస్తుండియుండవచ్చు. తండ్రి పరుగెత్తి అతనిని ముద్దాడాడు. కుమారుడు తన దయనీయమైన, అయోగ్య పరిస్థితిని వివరించే అవకాశం అతనికి వచ్చియుండలేదు. ఎందుకంటే, అతని రాకను తండ్రి సంబరం చేసుకునే ఉద్దేశంతో ఉన్నాడు. తప్పిపోయి వచ్చిన తన కుమారునికి ధనవంతుని కుమారుని వలె ప్రశస్తవస్త్రములు ధరింపచేసి, అతని చేతికి ఉంగరము తొడిగించి, అతని గౌరవార్థం విందు చేయించాడు. అయితే ఆసక్తికర విషయమేమంటే, ఇక్కడ గ్రంథకర్త వాడిన పదమును తరువాత కాలంలో దేవుని నుండి దూరమైన వారిని వివరించుటకు పౌలు కూడ ఈ పదమునే వినియోగించాడు “ఈ నా కుమారుడు *చనిపోయి* మరల బ్రదికెను” (లూకా 15:24ఎ; నొక్కి చెప్పింది నాది; చూడు 24 వచనం). ఇక్కడ పౌలు ప్రకారం, “కృప” అన్న పదం ప్రత్యక్షంగా ఉపయోగింపబడకపోయినను, ఇది ఇందుకు ఖచ్చితమైన ఉదాహరణ. లూకా 15లో: తప్పు చేసిన కుమారుడు దండన, శిక్షకు తప్ప మరిదేనికిని పాత్రుడు కాలేకపోయినా ప్రేమించు తండ్రి సంతోషంగా అతనిని తిరిగి చేర్చుకున్నాడు.

కృప యొక్క రెండు ప్రాముఖ్య గుణాలను పౌలు ఎఫెసీయులకు 2:4-10లో వివరిస్తున్నాడు. ఇవి లేకుండగా కృప “కృపగా” ఉండనేరదు.

### దేవుని కృప ఉచితమైనది

మొదటిగా, కృప ఉచితమైనది. రక్షణ అనేది “దేవుని వరము” (2:8బి) అని పౌలు చెప్తున్నాడు. దీనినే ఇంకనూ వివరిస్తూ, ఇది మన ప్రయత్నం వలన సాధించేది కాదని అతడు నొక్కి చెప్తున్నాడు: “అది క్రియలవలన కలిగినది కాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు” (2:9). ఒకవేళ మన సొంత ప్రయత్నం వలన రక్షణను పొందగలిగితే, మనకు కృప అవసరం ఉండేది కాదు. అప్పుడు యేసుని మరణానికి అర్థం ఉండేది కాదు (గలతీయులకు 2:21).

జీవితంలో అన్ని “ఉచితం” కాదు. కొన్నిసార్లు ఇన్సూరెన్స్ పాలసీకి డబ్బులు కట్టడానికి ఆఖరి తేదికి కొంత వ్యవధి (గ్రేస్ పీరియడ్‌ను) యిస్తారు. దీనర్థమేమంటే ఆ తేదీలో లేపు వాయిదాను చెల్లించలేకపోయినా మరికొంత వ్యవధి అనుమతించబడిందని అర్థం. నిజానికి, “ఉరితీయుటకు వాయిదాను చేయడం” వంటిది. ఎందుకంటే, ఇది నిర్ణయింపబడిన కాలము లోపునే జరగాలి. ఒకవేళ పాలసీని కట్టుటకు ఇవ్వబడిన “అదనపు వ్యవధి” కూడ దాటిపోతే పాలసీ పూర్తిగా పనికిరానిదవుతుంది. అయితే ఇందుకు భిన్నంగా క్రీస్తు ద్వారా దేవుడు

ఇస్తున్న అవకాశం పూర్తిగా ఉచితం. దీనిని వివరించేందుకు ఈ ప్రశ్నలకు మీకు మీరుగా సమాధానమివ్వండి. "యేసు క్రీస్తు సిలువలో నా నిమిత్తం చనిపోయేలాగున దేవుడాయన్ను పంపించేందుకు నేను చేసిన ఏ పని ఆయన్ను ప్రేరేపించింది?"; "నేను రక్షించబడునట్లు యేసు సిలువలో చనిపోయేందుకు నా పక్షముగా ఏది కారణమయింది?"; "దేవుని ప్రేమ మరియు ఆయన అందిస్తున్న రక్షణను గురించిన సువార్త సందేశమును తయారుచేయుటలో నా పాత్ర లేక కృషి ఏమయినా ఉందా? ... లేక సంఘస్థాపనలో నా సహకారం ఏమయినా ఉందా? ... లేక లేఖనములను వ్రాయించుటలో నా హస్తం ఏదయినా ఉందా? పరలోక ద్వారములను తెరచుటలో నా యొక్క కార్యం ఏమిటి?" దీన్ని బట్టి అర్థమయి ఉంటుంది, ఇందులోని ప్రతిదానిలో "లేదు" అన్నదే మన సమాధానం. మన రక్షణ నిజంగా "కృప" మీదనే ఆధారపడియుంది.

దేవుని కృపను గురించిన సత్యమును అంగీకరించడం మనకు కష్టంగానే ఉంటుంది. నిజానికి మనకు మనమే మనలను రక్షించుకొనగలము అని మనమిప్పటికే నమ్ముతాము. "బోధకుడా, నిత్యజీవము పొందుటకు నేను ఏ మంచి కార్యము చేయవలెను?" అని యేసును అడిగిన యౌవ్వనస్థుని వలె మనమున్నాము (మత్తయి 19:16). బహుశ పరలోకంలోకి సులభంగా చేరిపోయేందుకు ఒక గొప్ప పని ఏదో ఒకటుందని అతడు భావించియుంటాడు. అతనికి అసలు విషయం అర్థంకాలేదు. అది అతనికి ప్రభువు చూపించారు. మత్తయి 18:23–35లోని తన యజమానునికి పదివేల తలాంతులు అచ్చియున్న సేవకునివలె మనలను కూడా పోల్చి చెప్పవచ్చు (పదివేల తలాంతులు అంటే అప్పటి సమాన్య కూలీ యొక్క 150,000 సంవత్సరముల ఆదాయం); ఇంత ఉన్నాగాని, "నా యెడల ఓర్చుకొనుము, నీకు అంతయు చెల్లింతును" (26 వచనం) అని చెప్తున్నాడు. ఎంతటి కష్టమైన మాట ఇది! ఇంతటి అప్పును ఎవరూ చెల్లించలేరు. నిజానికి అతడు చెల్లించలేడు కానీ "ఆ దాసుని యజమానుడు కనికరపడి, వానిని విచిడిపెట్టి, వాని అప్పు క్షమించెను" అని యేసు చెప్తున్నాడు. ఇక్కడ కూడ యేసు "కృప" అను పదమును వాడలేదు కానీ ఈ కథ కృపకు సరైన అర్థాన్ని యిస్తుంది.

దేవుని కృప యొక్క సత్యతను అర్థం చేసుకోవడానికి మనకు ఎందుకు కష్టంగా తోస్తుంది? ఇందుకు అనేక కారణాలున్నాయి.

1. మనము దేనిని పొందడానికి అర్హులమో దానినే ఆశిస్తాము. మనము బాల్యదశలోనున్నప్పుడు నేర్చుకొన్న మాటలలో "అది సరైనదికాదు" అన్నమాట కూడ ఒకటి. మనం దేనిని పొందుకోవడానికి యోగ్యులమో దాని కోసమే మనం తాపత్రయపడుతుంటాము. మనం ఒక ఆటవస్తువు కోసం మారాం చేస్తున్నప్పుడు లేదా ఉద్యోగంలో ఏదో వృత్తి కోసం ప్రయత్నిస్తున్నప్పుడో ఈ వ్యాఖ్యపరంగా వర్తిస్తుంది. కానీ క్షమాపణ విషయంలో మాత్రం ఇది వర్తించదు. తీర్పు దినమున మనం దేవుని యెదుట నిలువబడినప్పుడు మనం దేనికి తగిన వారమో దానినే పొందుతాము. మనకు *అవసరమైన* – దేవుని కృపను గురించి మనం అర్హులు అవుతాము.

2. మన పాపం యొక్క స్థితిని, లోతును మనం గ్రహించలేకయున్నాము. ఇంతకాలం మనం చేసినవన్నియూ కేవలం కొన్ని "తప్పిదములు" అని మనం భావిస్తుంటే, దేవుని కృప అవసరతను మనం గ్రహించలేము. మనలోనున్న పాపం అనేది మనకు తగిలిన చిన్న దెబ్బలే, గాయములే అని, ఇందుకు పరలోక వైద్యుని అవసరం లేదని మనకు మనమే

వైద్యం చేయించుకోగలమని మనం భావించకూడదు. దేవుడు మనలను ఎలా చూస్తున్నాడో అలా మనలను మనం చూసుకున్నట్టయితే దేవుని రక్షణ అనేది కేవలం కృపచేతనే అని అర్థం చేసుకోగలం. పౌలు ప్రకారం, కృపలేనట్లయితే మనం "మన పాపములచేత ... చచ్చినవారమైయుండగా" కృపయే మనకున్న నిరీక్షణ.

3. మన పాపముల విషయమై మనం మరీ సున్నితంగా ఉంటాము. ఇంతకు ముందు చెప్పుకున్న సమస్యకు ఇది వ్యతిరేకమైనది. మనలను గురించి ఇతరులకంటే ఎక్కువగా (దేవుడు తప్ప) మనకే తెలుస్సు కాబట్టి ఇతరులకు తెలియని విషయాలలో సహితం మనమెంత పాపాత్ములమో మనం బాగుగా ఎరిగియుంటాము. దీన్ని గుర్తించి, మనలను గురించి అన్ని తెలిసిన దేవుడు మనయెడల తన కృపను విస్తరింపజేశాడంటే మనం నమ్మలేము. ఎందుకంటే మనమా కృపకు యోగ్యులము కాము. అందుకే అది కృప అని పిలువబడింది. మనకు మనముగా పొందలేని అవసరమైన వాటిని దేవుడు యేసు ద్వారా మనకు అందిస్తున్నాడు.

4. దేవుని గుణం మరియు స్వభావం గురించి మనకు సరియైన అవగాహన లేదు. మన నేపథ్యమును బట్టి దేవుని గురించిన అనేక విషయాలను మనకు మనముగా ఊహించు కుంటాము. కానీ, అనేకసార్లు వాక్యం ఆయన్ను గురించి చెప్తున్న వాటితో అవి సరిపోవు. కొంతమంది దేవునిని ఒక కఠినుడైన న్యాయాధిపతివలె ఊహిస్తారు. ఎందుకంటే, దేవుడు మనలోని తప్పులను చూసి వాటిని శిక్షించుటయే ఆయన ప్రాథమిక ఉద్దేశం అంటారు. ఏదీ కూడా సత్యమునకు దూరమైయుండనేరదు. దేవుడు "ప్రేమాస్వరూపి" (1 యోహాను 4:8) అని "అందరు అంతట మారుమనస్సు పొందవలెనని" (1 తిమోతి 2:4) దేవుడు కోరుతున్నాడని వాక్యం చెప్తుంది. దేవుడు కఠినులను, మారుమనస్సునొందనివారలను శిక్షించుతాడు కానీ అందరు రక్షణ పొందవలెనని ఆయన మనలను గురించి ఇచ్ఛయించుతున్నాడు. మన పాపముల నిమిత్తం చనిపోవడానికి ఆయన తన కుమారుడ్ని ఎందు నిమిత్తం పంపించాడు?

5. క్షమించలేని మన మానవ సంబంధాల నైజాన్ని మనం దేవునికి కూడా ఆపాది స్తుంటాము. క్షమించే గుణం లేని వారి మధ్య పెరిగినవారు ఎవరైనా తమను క్షమిస్తారంటే వారు నమ్మలేరు. ప్రత్యేకించి దేవుడు తమను క్షమించుతాడంటే నమ్మలేరు. ఇతరులను క్షమించలేనివారు దేవుడు క్షమించుతాడంటే, వారికి అది జీర్ణించుకోలేనిదిగా ఉంది. కానీ ఆయన అలా కాదు. ఆయన క్షమిస్తాడు. తన కృపచేత తన పిల్లలను ఆయన క్షమిస్తాడు.

6. దేవుని సేవించుటలో మనకు చెడు ఉద్దేశం ఉంది. మన పాపములనుబట్టి మనం అపరాధులము కాబట్టి ఆ అపరాధన భావననుబట్టి మనమాయన్ను ఘనపరచాలని లేదా దేవుడు మనలను చేయమన్నదానిని మనం చేయాలి. అయితే సత్యమేమంటే, దేవుని ఆరాధించుటకు, ఆయనకు విధేయులమైయుండుటకు నిర్ణయించుకునేందుకు మనలోని అపరాధ భావన అనేది కేవలం ఒక సహాయకారి లేదా మొదటి అడుగు మాత్రమే. మన పాపములను క్షమించినందుకు, మనలను క్షమించుటకు యేసు సిలువలో చనిపోయినందుకు మనం కృతజ్ఞత తెలియజేసేందుకు మనలను ప్రేరేపించేది ఆయన కృప. దేవుని కృపయందు విశ్వాసముంచుట ద్వారా అది మనలను దేవుని మంచి సేవకులనుగా తయారు చేస్తుంది. ఈ పనిని అపరాధ భావన చేయలేదు.

7. మనము అంతా సరిగ్గా, చాలా ఖచ్చితంగా చేయాలని మనం భావిస్తుంటాము. మనం మన జీవితంలోని ప్రతి పాపాన్ని పూర్తిగా తుడిచిపెడితేనే అప్పుడు దేవుడు మనలను

అంగీకరిస్తాడని “సంపూర్ణ తత్వము” తెలియజేస్తుంది. అంటే దేవుడు ఏర్పరచిన క్రమమును మనం త్రోసివేయడమే. సిలువ ద్వారా దేవుడు మనం ఏ స్థితిలోనున్నామో అదే స్థితిలోనే దేవుడు మనలను అంగీకరించి మనలోని పాపములను తీసివేస్తాడు. అలాగే, రక్షించబడాలంటే, మనం ఏం చేయాలని దేవుడు మననుండి ఆశిస్తున్నాడో దానిని ఖచ్చితంగా చేయాలి అని చెప్పే వాదమే “న్యాయ వాదము.” దేవున్ని సంతోషపర్చడం అన్నది ప్రతి క్రైస్తవుని లక్ష్యమే, అయినను ఈ విషయంలో మనం నిజాయితీగా ఉండాలి. వాస్తవంగా ఆలోచిస్తే, దేవుడు కోరుకున్నంతగా మనమాయన్ను సంతోషపరచలేము. మనం అందరము పాపం చేస్తుంటాము. మనం దేవుని కృపయందు ఆధారపడాలి గాని “అంతా మంచేచేసి తీరాలన్న” భ్రమలో ఉండిపోకూడదు. (ఈ విధంగా మనలను మనం రక్షించుకోగలమన్న భ్రమ గురించి యాకోబు 2:10 తెలియజేస్తుంది.)

ఒక వేళ “కృప” అనేది ఉచితం కాకపోయినట్లయితే, ఇది “కృపయే” కాదు. ఈ నిజాన్ని గ్రహించుటకు మన ఆలోచనా దృక్పథాన్ని మార్చుకోవాలి. ఒకసారి మనం మార్చుకోగలిగితే, దేవునినుండి గొప్ప ఆశీర్వాదం పొందగలము.

### దేవుని కృప సమృద్ధియైనది

“కృప” యొక్క రెండవ ప్రాముఖ్య గుణం అది సమృద్ధియైనది. దేవుడు తన కృపను మనయెడల “విస్తరింపజేశాడు” అని ఎఫెసీయులకు 1:7, 8లో పౌలు వ్రాస్తున్నాడు. దేవుడు “కరుణాసంపన్నుడు” అని 2:4లో మనం చూస్తున్నాము. అలాగే ఆయన “మహదైశ్వర్యము” గురించి 6 మరియు 7 వచనాలు చెప్తున్నాయి. కృపను అర్థంచేసుకోవడంలో ఇది ఎందుకు ప్రాముఖ్యమైనది? ఎందుకంటే, మన పాపముల స్వభావముల లేక పరిధితో సంబంధం లేకుండా దేవుడు క్షమిస్తాడు. కృప అనేది “మంచివారికి” కాదు. ఇది పాపుల కొరకు, పాపులందరి కొరకు. “పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మతగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునై యున్నది” అని పౌలు 1 తిమోతి 1:15లో వ్రాస్తున్నాడు. దీనికి ముందు అతడు క్రీస్తును ఎంతగా దూషించి, హింసించి అవమానించాడో పేర్కొన్నాడు. అయినా, “ప్రభువు యొక్క కృప ... అత్యధికముగా విస్తరించెను” (1 తిమోతి 1:14) అని తెలియజేస్తున్నాడు. ఎందుకు దేవుడు తన కృపకు మాదిరిగా పౌలును ఉంచాడు, పౌలు దీనిని యిలా వివరిస్తున్నాడు:

> అయినను నిత్యజీవము నిమిత్తము తనను విశ్వసింపబోవువారికి నేను మాదిరిగా ఉండులాగున యేసుక్రీస్తు తన పూర్ణమైన దీర్ఘశాంతమును ఆ ప్రధానపాపినైన నాయందు కనపరచునట్లు నేను కనికరింపబడితిని (1 తిమోతి 1:16).

మరోమాటలో చెప్పాలంటే, నాకు, “రక్షణా నిరీక్షణ లేదు” అని ఎవరూ చెప్పకుండా, దేవుడు పౌలును రక్షించాడు. దేవుడు క్షమించలేనంత పాపమును మనం చేయలేము. తప్పిపోయిన కుమారుడు తన తండ్రి దగ్గరకు వచ్చినప్పుడు ఎటువంటి సంజాయిషీలు లేవు. అతడు పాపి అని అప్పటికే నిరూపించబడింది. అతడు ఏం చేశాడన్నది విషయం కాదు గాని, అతడు ఇంటికి తిరిగి వచ్చాడన్నదే ప్రాముఖ్య విషయం.

కృప అనేది ఉచితమైనది, సమృద్ధిగలది. అందుకనే క్రైస్తవ సందేశం “సువార్త” అని

పిలువబడింది; ఇది నిజంగా శుభవార్త!

## "విశ్వాసం ద్వారా"

కృప ఉచితం మరియు సమృద్ధిగలది గాని అది చవకైనది కాదు. సువార్త సందేశం ద్వారా కృప అందరికి అందచేయబడుతుంది; గాని దానిని అందరు అంగీకరించాలి. కృప చేతను, విశ్వాసంద్వారాను మనం రక్షించబడుతున్నామంటే పౌలు యొక్క ఉద్దేశం దేవుని కుమారునిద్వారా తండ్రి మనకు అందిస్తున్న దానిని మనం అంగీకరించాలి.

ఇక్కడ, తప్పిపోయిన కుమారుని ఉదంతం మంచి ఉదాహరణగా చెప్పవచ్చు. అతడు తన ఇంటికి తిరిగి వెళ్లాలని నిశ్చయించుకోకముందే అతని తండ్రి చేత అతడు అంగీకరించబడ్డాడు (ఇది కృప). అలా గాక, తన ఇంటికి తాను వెళ్ళదల్చుకోనంత వరకు అతడు మృతుడైయున్నాడు. వాస్తవానికి వస్తే, క్రైస్తవుడు కూడా తప్పిపోయిన కుమారుని వంటివాడే! అతడు తిరిగి ఇంటికి వచ్చి తండ్రి కృపపొందాడు. అందుకు ప్రతిగా ఆనందముతో ప్రేమతో తండ్రిని సేవించాడు. మన రక్షణకు క్రియలు మూలం కాదని పౌలు చెప్తూనే, అవి దాని ఫలములు అని చెప్తున్నాడు: "మరియు వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై, మనము క్రీస్తు యేసునందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పనియైయున్నాము" (2:10). "వాటి (సత్ క్రియల) యందు నడుచుకొనడం" అంటే, అవి మన జీవన విధానంలో భాగం కావడం.

విశ్వాసంలోని ఏ కోణాన్ని విడిచిపెట్టకూడదు. వీటిలో ఒకటి నమ్మకం. యేసునందు నమ్మికయుంచడమంటే, ఆయన్ను దేవుని కుమారునిగా, మన రక్షకునిగా అంగీకరించడం. అలాగే, లేఖనములు చెప్తున్న ప్రకారం, మనలను శుద్ధులనుగా చేసి మనకు జీవమునిస్తుందని ఆయన రక్తమును గురించిన నమ్మిక కూడ ఇందులోని భాగం. "నమ్మకం" అంటే మనల్ని మనం ఆయన చేతులకు అప్పగించుకుని, ఆయన వాగ్దానాలు మనయందు మనలో నెరవేరుతాయని నమ్మడం. విశ్వాసం కలిగియుండడమంటే, క్రీస్తు మనకు అందిస్తున్న వాటి అవసరమును గుర్తించడం. సువార్తను నమ్మడం అంటే, తన మరణం ద్వారా క్రీస్తు మనందరి నిమిత్తం వెలబెట్టి కొన్నదాని అవసరతను గ్రహించడం. మనకు నిజంగా విశ్వాసం ఉంటే, మనం దేవుని ఆజ్ఞలను గైకొంటాము. తప్పిపోయిన కుమారుడు పందుల శాలను విడిచి తండ్రి ఇంటికి చేరినట్లు, మనం కూడ మన పాప మార్గములను విడిచి దేవునికి విధేయులైన పిల్లలముగా జీవించుటకు మనం పిలువబడుతున్నాము. పెంతెకొస్తు దినాన పేతురు ప్రసంగాన్ని విన్నవారు "సహోదరులారా, మేమేమి చేతుము?" అని ప్రశ్నించారు (అపొస్తలుల కార్యములు 2:37). ఇందుకు పేతురు ఇచ్చిన సమాధానంలో ఆజ్ఞ మరియు వాగ్దానం రెండూ ఉన్నాయి: "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (2:38). విధేయతతో క్రీస్తునందలి జీవితం ప్రారంభమవుతుంది. మరణము వరకు విధేయతతోను, విశ్వాసముతోను క్రైస్తవుడు తన జీవితమును కొనసాగించాలి. (చూడు హెబ్రీయులకు 5:7-10; మత్తయి 7:21-27; ప్రకటన 2:10.)

విశ్వాసం గురించి చెప్పబడుతున్న కొన్ని ప్రాథమిక విషయాలు నిజానికి వక్రీకరించబడ్డాయి. విశ్వాసం అంటే, దేవుని గురించిన అవగాహన కలిగియుండడం కాదు.

కొంతమంది "దేవునియందు నమ్మకముంచినంత" మాత్రాన వారు విశ్వాసం కలిగియున్నట్లు కాదు. ఇటువంటి "విశ్వాసం" కలిగియున్న వారి గురించి యాకోబు తన చదువరులను హెచ్చరిస్తున్నాడు – దేవుడొక్కడే అని నీవు నమ్ముచున్నావు అని చెప్తూ "దయ్యములును నమ్మి వణకుచున్నవి" (యాకోబు 2:19) అని వివరిస్తున్నాడు. ఇటవంటి "విశ్వాసంతో" ఏ దయ్యము రక్షించబడనేరదు. "విశ్వాసం" అనేది అంతరంగంలో (హృదయంలో) ఉండేది కాదు. ఇది మన హృదయంలోనే ఆరంభమవ్వాలి. ఇది మన అనుదిన కార్యములలో ప్రభావం చూపకపోతే, ఇది సంపూర్ణ విశ్వాసం అనిపించుకోదు. "విశ్వాసమును బట్టి హేబెలు … అర్పించెను …"; "విశ్వామును బట్టి … నోవహు … సిద్ధపరచెను …"; "విశ్వాసమునుబట్టి అబ్రాహామును … విధేయుడయ్యాడు"; "విశ్వాసమునుబట్టి … అర్పించెను …" అని హెబ్రీయులకు 11వ అధ్యాయంలో చూస్తున్నాము. విశ్వాసం అంటే కేవలం నమ్మిక కాదు. మనం ఏదయితే సత్యమని నమ్ముతున్నామో దానియందు కార్యము చేయడం విశ్వాసం. అలాగే, లేఖనములలో చెప్పబడిన సత్య సిద్ధాంతములను నమ్మడం విశ్వాసం కాదు. ఇందులో అటువంటి నమ్మిక యుంటుంది (1 మరియు 2 తిమోతిలలో పౌలు దీనిని "విశ్వాసం" అని పిలుస్తున్నాడు), గాని నమ్మినదాని కంటే అతీతమైనది, విశ్వాససహిత జీవితమును జీవించడం.

### "నీవు?"

"మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు" (2:8ఎ) అని పౌలు వ్రాస్తున్నాడు. ఈ గొప్ప సత్యమే మనందరికి రక్షణ అందుబాటులో ఉండేలా చేసింది. ఒకవేళ యిలా కాకపోతే, మనందరికి రక్షణ నిరీక్షణ ఉండేది కాదు.

"మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు" అని పౌలు ఎవరితో చెప్తున్నాడు? అతడు సర్వ మానవాళిని ఉద్దేశించి ఈ మాట చెప్పడం లేదని మనం గుర్తుంచుకోవాలి. క్రీస్తునందున్న విశ్వాసులనుద్దేశించి అతడు ఈ మాటలు చెప్తున్నాడు. "ఎఫెసీలోనున్న పరిశుద్ధులును క్రీస్తుయేసునందు విశ్వాసులైన" వారికి ఈ ఎఫెసీ పత్రిక వ్రాయబడింది (1:1). "ప్రభువైన యేసునందలి మీ విశ్వాసమునుగూర్చియు, పరిశుద్ధలందరి యెడల మీరు చూపుచున్న ప్రేమను గూర్చియు నేను వింటిని" అని 1:15లో పౌలు వ్రాస్తున్నాడు. తాను ఎవరిని "మీరు" అని సంబోధించి వ్రాస్తున్నాడో వారి గురించి 2:1–5లో పేర్కొంటున్నాడు: ఒకప్పుడు మృతులైయుండి ఇప్పుడు క్రీస్తుయేసుద్వారా లేపబడి సజీవులైయున్న విశ్వాసులను గురించి అతడు వ్రాస్తున్నాడు.

అయితే శుభవార్త ఏమిటంటే, భూమియందలి ప్రతి ఒక్కరితోను పౌలు ఈ విషయం చెప్తున్నాడు. మన పాపముల స్థితి ఎంత ఉన్నను, విశ్వాసం ద్వారా మనం కృపను పొందుకొనగలం. దేవుని అమూల్యమైన బహుమానాన్ని మన నిమిత్తం వెలచెల్లించి ఉంచాడు. దానిని ప్రతి ఒక్కరూ పొందుకోవాలని ఆయన కోరుతున్నాడు. దీన్ని మీరు ఎలా తిరస్కరించగలరు?

---

సూచనలు

[1]ఈ విషయంలో పౌలు యొక్క ఆలోచనను అర్థంచేసుకోవాలంటే, ఎఫెసీయులకు 1:3-23ను చదివి, అందులోని "క్రీస్తునందు," "ఆయనయందు," వంటి పదాలను, ఈ పదము యొక్క సమానార్థ పదములను గుర్తించి చదవండి. [2]C. L. Mitton, *Ephesians,* The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Marshall, Morgan, & Scott, 1973), 92.

---

## విశ్వాసము లేక క్రియలు: యాకోబు పౌలుతో సమ్మతించాడా?

రక్షణ అనేది విశ్వాసం ద్వారానే కలుగుతుంది కానీ క్రియలవలన కాదు అని పౌలు తన పత్రికలలో (ఎఫెసీయులకు 2లో వలె), అనేక చోట్ల తెలియజేస్తున్నాడు (ఉదాహరణకు చూడు రోమీయులకు 3:28; గలతీయులకు 2:15-21).

యాకోబు 2వ అధ్యాయంలో మనకు ఈ మాటలు కనబడుతున్నాయి: "మనుష్యుడు విశ్వాసమూలమున మాత్రముకాక, క్రియల మూలముననను నీతిమంతుడని యెంచబడునని, మీరు దీనివలన గ్రహించితిరి" (24 వచనం); "ప్రాణములేని శరీరమేలాగు మృతమో అలాగే క్రియలు లేని విశ్వాసమును మృతము" (26 వచనం). యాకోబు మరియు పౌలులు భిన్నమైన బోధనలను ఇక్కడ చేస్తున్నారని కొంతమంది బోధిస్తుంటారు. రక్షణ అనేది విశ్వాస మూలముగా వస్తుందని పౌలు చెప్తుండగా, క్రియలు మూలముగా రక్షణ కలుగుతుందని యాకోబు బోధిస్తున్నాడు.

నిజానికి, పౌలు మరియు యాకోబులు రెండు వేర్వేరు విషయాలపై బోధనలు చేస్తున్నారు. యూదుల ధర్మశాస్త్రమును అనుసరించడం (క్రీస్తునందు విశ్వాసముంచుటతో పాటు) అవసరమా లేదా అన్న ప్రశ్నకు సమాధానం పౌలు ఇస్తున్నాడు. అయితే ఏరకమైన విశ్వాసం రక్షించుతుంది అన్న విషయాన్ని గురించి యాకోబు చర్చించుతున్నాడు. క్రియా రూపక విశ్వాసం (క్రియలతో కూడిన విశ్వాసం) రక్షిస్తుందని లేకపోతే, అది మృతము అని అతడు నొక్కి చెప్తున్నాడు. విధేయత అనేది విశ్వాసములో ఒక అవసరమగు కోణం అని పౌలు చెప్పడమును గమనిస్తే, రక్షించే విశ్వాసం యొక్క స్వభావం విషయంలో పౌలు చెప్తున్న దానితో యాకోబు విభేదించడం లేదు అని మనకర్థమవుతుంది. పౌలు రోమీయులకు 2:6-11లో యిలా వ్రాస్తున్నాడు:

> ఆయన *ప్రతివానికి వాని వాని క్రియలచొప్పున* ప్రతిఫలమిచ్చును. సత్క్రియను ఓపికగా చేయుచు. మహిమను ఘనతను అక్షయతను వెదకువారికి నిత్యజీవము నిచ్చును. అయితే భేదములు పుట్టించి, *సత్యమునకు లోబడక దుర్నీతికి లోబడువారి మీదికి* దేవుని ఉగ్రతయు రౌద్రమును వచ్చును. దుష్కార్యముచేయు ప్రతి మనుష్యుని ఆత్మకు, మొదట యూదునికి గ్రీకుదేశస్థునికికూడ, శ్రమయు వేదనయు కలుగును. *సత్క్రియ చేయు* ప్రతివానికి, మొదట యూదునికి గ్రీసుదేశస్థునికికూడ, మహిమయు ఘనతయు సమాధానమును కలుగును. (నొక్కి చెప్పింది నాది.)

కృప మరియు విశ్వాసం ద్వారా రక్షణ కలుగుతుందని పౌలు చెప్పిన బోధను పౌలు కాలంలోని అనేకమంది (ఇప్పటివారివలె) అపార్థం చేసుకున్నారు. అంటే, ఒక వ్యక్తి రక్షించబడుటకు తనకు తాను ఏమీ చేయనక్కర్లేదు అని వారు భావించారు. యాకోబు చెప్పిన మృత విశ్వాసమునకు పౌలు యొక్క కృపను గురించిన బోధను అన్వయించి తద్వారా మన పాపములు దేవునిని మరింత కృపామయునిగా చేస్తాయని మరి కొంతమంది తప్పుడు

భావనను తీసుకువచ్చారు. ఇది పౌలు యొక్క ఉద్దేశం కాదు. దీనిని అతడు రోమీయులకు 2:5-8; 6:1, 2లో స్పష్టంగా వివరించాడు.

బహుశ పౌలు యొక్క బోధ వక్రీకరించబడడం చూస్తే, దానిని ఖండించుటకు విశ్వాసమునకు క్రియలు అవసరమని యాకోబు బోధించియుండవచ్చు. ఒకవేళ ఇదే సరైనదో కాదో గాని, ఇద్దరు గ్రంథకర్తలు కూడా విశ్వాసం అనేది దేవునికి ప్రతిస్పందించుట అని, ఇది కేవలం జ్ఞానసమ్మతమో లేక అంతర నమ్మకమో కాదని బోధిస్తున్నారు.